
## జిల్లా స్థాయి ఉపన్యాస పోటీలకు ఎంపికైన నందిని, సరస్వతి



**మల్దకల్, నవంబర్ 15, ప్రభాతవార్త :** నడిగడ్డ తెలంగాణ సోషల్ ఫోరం ఆధ్వర్యంలో మండల స్థాయి ఉపన్యాస పోటీలు మంగళవారం నిర్వహించారు. ఈ ఉపన్యాస పోటీలలో అమరవాయి ఉన్నత పాఠశాల విద్యార్థి నందిని మొదటి బహుమతి, తాటికుంట ఉన్నత పాఠశాల విద్యార్థిని సరస్వతి ద్వితీయ బహుమతులను గెలుపొందారు. ఈ నెల 17న జరిగే జిల్లా స్థాయి ఉపన్యాస పోటీలకు వారు ఎంపికయ్యారు. ఈ ఉపన్యాస పోటీలకు న్యాయనిర్ణేతలుగా మల్దకల్ జూనియర్ కాలేజీ లెక్చరర్ రామాంజనేయులు గౌడ్, ర మేష్ వ్యవహరించారు. ఈ పోటీలకు మండలంలోని మొత్తం 8 ఉన్నత పాఠశాలలు పాల్గొన్నాయి. ఈ కార్యక్రమంలో నడిగడ్డ తెలంగాణ సోషల్ ఫోరం అధ్యక్షుడు పాల్వాయి లక్ష్మీనారాయణ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇమాన్యుయెల్, గోవింద్, క్రాంతి కుమార్, జాకీర్ హుస్సేన్, జ్యోతి, వెంకటేష్, పాల్గొన్నారు.

# మహబూబ్‌నగర్ వార్త

తెలుగు జాతీయ దినపత్రిక



## ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థుల శ్రమదానం

**మల్దకల్, నవంబర్ 15, ప్రభాతవార్త :** ప్రభుత్వ జూనియర్ కళాశాల మల్దకల్‌లో కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు శ్రమదానం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు కళాశాలలోని కంప చెట్లను, ముళ్ల పొదలను తొలగించారు. అదేవిధంగా కళాశాల వెనక భాగాన ఉండే చెట్లను, కళాశాల నుండి ప్రధాన రహదారికి వెళ్లే దారిలో ఉండే చెత్తాచెదారం తొలగించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రో గ్రాం ఆఫీసర్లు రామాంజనేయులు గౌడ్, నరసింహులు, అధ్యాపక బృందం పాల్గొన్నారు.



పరిసరాలను శుభ్రం చేస్తున్న విద్యార్థులు

## కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి

### - తెలంగాణ జన సమితి జిల్లా అధ్యక్షుడు ఖాదర్ పాష



**వనపర్తి టౌన్, నవంబర్ 15, ప్రభాతవార్త :** వనపర్తి జిల్లా కేంద్రంలో రోడ్ల విస్తరణ భాగంగా కరెంటు కాంట్రాక్టర్ సంపత్ రెడ్డి పై తగిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ దృష్టికి తెలంగాణ జన సమి తి పార్టీ జిల్లా అధ్యక్షుడు ఖాదర్ పాష తీసుకురా వడం జరిగింది. ఎస్పీ సంపత్ రెడ్డి 4,5రోజుల్లో విచారణ చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటా మని తెలిపారని ఆయన తెలియజేశారు. అదే విధంగా మున్సిపల్ డీఈ దృష్టికి కూడా తీసుకు రావడం జరిగిందని అన్నారు. మున్సిపాలిటీకి సంబందించిన పనులపై విచారణ చేసి సంపత్ రెడ్డి తగిన చర్యలు తీసుకుంటామని డీఈ తెలిపా రని వివరించారు. ఈ సందర్భంగా తెలంగాణ జనసమితి పార్టీ జిల్లా అధ్యక్షుడు ఖాదర్ పాష మాట్లాడుతూ జిల్లా కేంద్రం లో పూర్తిగా ఆయన చేస్తున్న పనులన్నీ నాసిరకం పనులు చేస్తూ బిల్లును కూడా నిలిపివేయాలని సంపత్ రెడ్డి చేస్తున్న పనులను అధికారులు చూసి కాంట్రాక్టు లైసన్సు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గతంలో గోపాల్‌పేట మండలం తాడిపర్తి గ్రామాల్లో ఒక రైతుపై దాడి చేసిన సంపత్ రెడ్డి పై కాంట్రాక్టు పనులపై విచారణ చేయాలని తెలిపారు. అదే విధంగా వనపర్తిలో స్థభాలు పాతడంలో కరెంటు లైన్ గుంజడంలో పూర్తిగా విఫలమయ్యారని ఎస్పీ ని కోరుతూ సంపత్ రెడ్డి పై తగిన చర్యలు తీసుకొని ఆయన లైసెన్సు రద్దు చేయాలని కోరారు.

## స్ఫూర్తివంతమైన చిత్రాలు అందించిన కృష్ణ మృతికి సంతాపం

**వనపర్తి టౌన్, నవంబర్ 15, ప్రభాతవార్త :** అల్లూరి సీతారామరాజు, ఈనాడు వంటి స్ఫూర్తివంతమైన విప్లవ చిత్రాలు అందించిన సూపర్ స్టార్ కృష్ణ మరణం సినీ రాజకీయ రంగానికి తీరనిలోటని సీపీఐ జిల్లా కార్యదర్శి కె.విజయరాములు, జిల్లా కార్యవర్గ సభ్యులు పి.కళావతమ్మ, కె.శ్రీరామ్, మోష, మంగళవారం ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. పండంటి కాపురం లాంటి మంచి కుటుంబ చిత్రాలను, కురుక్షేత్రం లాంటి గొప్ప చిత్రాలను ఆయన తెలుగుజాతికి అందించారని తెలిపారు. కురుక్షేత్రం హిందీలో నిర్మించి తెలుగు సినిమా ప్రతిభను చాటారని పేర్కొన్నారు. నటనలో పలు కోణాలను ఆవిష్కరించిన ఆయన, తెలుగు జాతి గర్వించే గొప్ప హీరోగా మానసున్న మనిషిగా, ధైర్య సాహసాలకు మారుపేరుగా, చిత్రసీమలో పలు కొత్త ప్రయోగాలకు శ్రీకారం చుట్టారని, కొత్తవారిని ప్రోత్సహించి విజయం సాధించారని కొనియాడారు. రాజకీయ అరంగేట్రం చేసి ఎంపీగా ఎన్నికై ప్రజలకు సేవలందించారని కొనియాడారు.

## జిల్లాలో పెండింగ్ భూసమస్యల దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

### - రెవెన్యూ అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష



రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

**నారాయణపేట ప్రతినిధి, నవంబర్ 15, ప్రభాతవార్త :** జిల్లాలోని పెండింగ్ భూ సమస్యల దరఖాస్తులను వెంటనే పరిష్కరిం చాలని, మీసేవ ద్వారా ధరణిలో పెండింగ్ మ్యూటేషన్ దరఖాస్తులను, పెండింగ్ వివరాలను డీటీ నారాయణ ను అడిగి కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ నారాయణపేట తహసిల్దార్ కార్యలయాన్ని మంగళవారం ఆకస్మిక తనిఖీ చేసి భూ రికార్డులను పరిశీలించారు. అదేవిధంగా ఎంపీడీఓ కార్యాలయంలో అధికారుల ఉపస్థితి వివరాలను పర్యవేక్షులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ కార్యాలయానికి సమయానికి చేరుకోవాలని అన్నారు. ఎంపీడీఓ కార్యాలయానికంటే ముంతు తహసిల్దార్ కార్యాలయా న్ని పరిశీలించి కార్యలయాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పథ్ రికార్డులలను తమ రికార్డ్ గదికి లేదా కలెక్టరేట్ కు పంపాలని అన్నారు. కార్యాలయంలో పెండింగ్ లో ఉన్న అన్ని ఫైల్స్‌ను తమ పరిధిలో ఉన్న వాటిని వెంటనే పరిష్కరించాలని, తమ పరిధిలోని లేని వాటిని వెంటనే సంబందిత అధికారులకు ఇవ్వాలని సూచించారు.

## ఘనంగా ఊరడమ్మ పండుగ

**అమరచింత, నవంబర్ 15, ప్రభాతవార్త :** అమరచింత మున్సిపల్ కేంద్రంలో శ్రీకృష్ణ నగర్ వెలసిన శ్రీ ఊరడమ్మ పండుగ ఉత్సవాలు మంగళవారం అమరచింత మున్సిపల్ ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఊరడమ్మ పండుగ ఉత్సవాల సందర్భంగా అమరచింత మున్సిపల్ చైర్‌పర్సన్ వి.మంగమ్మ నాగభూషణం గౌడ్ దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు శ్రీ ఊరడమ్మ దేవతకు నైవేద్యం పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో తాటికొండ రమేష్, కావలి వెంకటన్న, గగాయిత్రి శ్రీను, గోవర్ధన్, టి.రాజు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## మనిగిల్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించిన మండల విద్యాధికారి జయశంకర్

**పెద్దమందడి, నవంబర్ 15, ప్రభాతవార్త :** పాఠశాల ప్రదర్శనలో భాగంగా పెద్దమందడి ఎంఈఓ జయశంకర్ మంగళవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మనిగిల్ల ను సందర్శించారు. మనిగిల్ల పూర్వ విద్యార్థి దాత బాల్‌రెడ్డి ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్ ను పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం చేయడానికి దాతలు ముందుకు రావడం హర్షణీయమని అన్నారు. మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో అభివృద్ధి చేయడానికి దాతలు ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.శంకర్‌గౌడ్, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు గౌడ్, విష్ణువర్ధన్ రెడ్డి, నాగేశ్వరమ్మ, సురేఖ, బాలాజీ, చంద్రకళ, శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.



కంప్యూటర్ ల్యాబ్‌ను పరిశీలిస్తున్న ఎంఈఓ జయశంకర్

## సీఆర్‌టీ, పీజీలకు బోధనేతర సిబ్బందికి పేస్కేలు అమలు చేయాలి

**అమరచింత, నవంబర్ 15, ప్రభాతవార్త :** మంగళవారం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా కేజీబీవీ సమస్యల పరిష్కారం కోసం భోజన విరామ సమయంలో అమరచింత కేజీబీవీలో నిరసన కార్యక్రమం జరిగింది. కాంట్రాక్టు పద్దతి రద్దుచేసి సీఆర్‌టీ, పీజీటీ లను, బోధనేతర సిబ్బందిని రెగ్యులరైజ్ చేయాలి, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గురుకుల ఉపాధ్యాయులతో సమానంగా వేతనాలు ఇవ్వాలని వాటిని అమలు చేయాలి, సంవత్సరానికి 27 రోజులు సెలవులు ఇవ్వాలని సర్వీస్ నిబంధనలు రూపొందించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేజీబీవీ లో పని చేస్తున్న టీచర్లకు బదిలీలు నిర్వహించాలని, అన్ని కేజీబీవీ లలో ఉన్న నీటి వసతి విద్యుత్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఒకేషనల్ టీచర్స్ నియమించాలంటే డిమాండ్స్ తో కార్యక్రమం కొనసాగింది. ఈ కార్యక్రమంలో స్వరూప, రెహానా, విజయలక్ష్మీ, దేవి, పద్మ, రేవతి తదితరులు పాల్గొన్నారు.



కేజీబీవీ పాఠశాలలో నిరసన తెలుపుతున్న దృశ్యం

### తెలంగాణ వైద్య విద్య దేశ చరిత్రలో

## సువర్ణ అక్షరాలతో లిఖించ దగిన ఘట్టం



మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డా.సునందినికి స్వీట్ తినిపిస్తున్న కలెక్టర్ షేక్ యాస్మిన్ బాష

**వైద్య సేవలు ప్రతి ఒక్కరికి అందాలి**

**వైద్య విద్య కోసం విదేశాలకు వెళ్లవలసిన అవసరం ఉండదు**

**33 జిల్లాలలో ప్రభుత్వ వైద్య కళాశాలల ఏర్పాటు దిశగా అడుగులు**

**ఈ ఏడాది ప్రభుత్వ వైద్య కళాశాలలో అదనంగా 1150 సీట్లు**

**850 నుండి 2790కి పెరిగిన ఎంబీబీఎస్ సీట్లు**

**వనపర్తి ప్రతినిధి, నవంబర్ 15, ప్రభాతవార్త :** తెలంగాణ ప్రభుత్వం వైద్య విద్యను సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను, వైద్య సదుపాయాలను అభివృద్ధి చేస్తున్నట్లు రాష్ట్ర వైద్య విద్య ను సువర్ణ అక్షరాలతో లిఖించదగిన ఘట్టమని, నూతన అధ్యాయానికి నాంది ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు సూచించారు. మంగళవారం హైదరాబాద్ ప్రగతి భవన్ నుండి వనపర్తి, రామగుండం, మంచిర్యాల, మహబూబాబాద్, కొత్తగూడెం, సంగారెడ్డి, నాగర్‌కర్నూల్, జగిత్యాల, జిల్లాలో నూతనంగా నిర్మించిన 8 ప్రభుత్వ వైద్య కళాశాలలో విద్యా బోధనా తరగతులను రాష్ట్ర ముఖ్యమంత్రి, రాష్ట్ర ఆరోగ్య వైద్య శాఖ మంత్రి హరీష్ రావు, ఆర్ అండ్ బి శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి, రాష్ట్ర సీఎస్ సోమేష్ కుమార్, వైద్యశాఖ ముఖ్య కార్యదర్శి రిజ్వి, వైద్య విద్య డైరెక్టర్ రమేష్ రెడ్డి, ఇతర శాఖల ఉన్నతాధికారులతో కలిసి వర్చువల్ విధానంలో మెడికల్ కళాశాలలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్ మాట్లాడుతూ 57 సంవత్సరాల ఉమ్మడి పాలనలో తెలంగాణ ప్రాంతంలో కేవలం 3 ప్రభుత్వ వైద్యకళాశాలలు మాత్రమే ప్రారంభమయ్యాయని, గత 8 ఏళ్లలో 12 ప్రభుత్వ వైద్య కళాశాలలు ప్రారంభించడం శుభ పరిణామం అని ఆయన సూచించారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తరువాత సిద్దిపేట, నల్గొండ, సూర్యాపేట, మహబూబ్‌నగర్ జిల్లాలో మెడికల్ కళాశాలల ఏర్పాటు చేశామని, భద్రాది కొత్తగూడెం, నాగర్‌కర్నూల్, వనపర్తి, మంచిర్యాల, జగిత్యాల, సంగారెడ్డి, రామగుండం, మహబూబాబాద్ జిల్లాలో వైద్య కళాశాలల్లో నేడు విద్య బోధన ప్రారంభించడం జరిగిందని, ఇందుకు కృషి చేసిన అధికారులకు, ప్రజా ప్రతినిధులకు సీఎం కేసీఆర్ ప్రత్యేక అభినందనలు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర వైద్య విద్య దేశ చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించదగిన ఘట్టమని ఆయన అన్నారు. ఉద్యమ నాయకులు, మంత్రిగా బాద్యలు చేపట్టిన హరీష్ రావు నిరంతరం పర్యవేక్షణ ఫలితంగా దీనిని సాధించామని కేసీఆర్ అన్నారు. 8 ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రారంభోత్సవానికి కృషి చేసిన వైద్య ఆరోగ్య శాఖ మంత్రిని కేసీఆర్ ప్రత్యేకంగా అభినందించారు. రాష్ట్రంలో నూతన వైద్య కళాశాలలు ఏర్పాటుతో ఇతర దేశాలకు వెళ్లిల వైద్య విద్యను అభ్యసించవలసిన దుస్థితి తప్పిందని, తెలంగాణ రాష్ట్రంలో ప్రతిభ ఉన్న నిరుపేద విద్యార్థులు ఇతర రాష్ట్రాలకు వెళ్లి చదివే అవసరం లేకుండానే స్వరాష్ట్రంలోనే వారి స్వప్నాలను సాకారం చేసుకునే అవకాశం కల్పించినట్లు ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యల ఫలితంగా ఎంబీబీఎస్, పీజీ సూపర్ స్పెషాలిటీ సీట్లు గణనీయంగా పెరిగాయని ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడే నాటికి 850 ఎంబీబీఎస్ సీట్లు ఉండేవని వాటిని ప్రస్తుతం 2790 సీట్లకు, 515 ఉన్న పజీ సీట్లు 1180కు, 70 సూపర్ స్పెషాలిటీ సీట్లు ప్రస్తుతం 152 సీట్లకు పెరిగాయని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన రెసిడెన్షియల్ ప్రభుత్వ వైద్య కళాశాలలో విద్యార్థులకు మంచి అవకాశం కల్పిస్తున్నట్లు గురుకుల పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు సైతం రాణిస్తూ అద్భుతమైన ఫలితాలు సాధిస్తున్నారని, వారికి మెడికల్ కాలేజ్ సీట్లు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటాయని ఆయన సూచించారు. రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో ప్రభుత్వ వైద్య కాలేజీల ఏర్పాటు అయ్యే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, ప్రస్తుత సంవత్సరం మరో 8వైద్య కళాశాలలు వచ్చే సంవత్సరం 9 కళాశాలల ఏర్పాటుకు ప్రణాళిక సిద్ధం చేశామని ఆయన వివరించారు. ప్రభుత్వ వైద్య కళాశాల అంశంలో రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వం వ్యవహరిస్తుందని, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ పథకాల మాదిరిగా ప్రతి ప్రాంతానికి ఫలాలు అందే విధంగా తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని సీఎం అన్నారు. వైద్య రంగాన్ని పటిష్టపరిచేందుకు వైద్యులతో పాటు, నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్స్, మెడికల్ సిబ్బంది సైతం కీలకమని ఆయన తెలిపారు. జిల్లాలో వైద్య కళాకారులతో పాటు నర్సింగ్ కళాశాలలు ఏర్పాటు చేయాలని ప్రతి జిల్లాకు ఒక్కో పారామెడికల్ కోర్సు అందే విధంగా ప్రణాళిక రూపొందించి విద్యా సంస్థలు ఏర్పాటు చేయాలని సీఎం కేసీఆర్ వైద్య ఆరోగ్యశాఖ మంత్రిని ఆదేశించారు. ములుగు, జయశంకర్ భూపాలపల్లి వంటి జిల్లాలో ఒక అసెంబ్లీ నియోజకవర్గం మాత్రమే ఉన్నప్పటికీ అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో జిల్లా ఏర్పాటు చేశామని త్వరలో మెడికల్ కళాశాల సైతం మంజూరు అవుతుందని సీఎం కేసీఆర్ తెలిపారు. కరోనా లాంటి విపత్కర పరిస్థితుల్లో అగ్ర దేశాలైన అమెరికా, యూరోప్ దేశాలలో సైతం లక్షల మంది మరణించారని భవిష్యత్‌లో ఇలాంటి అనేక వైరస్‌లు వచ్చే ప్రమాదం ఉందని శాస్త్రవేత్తలు హెచ్చరించారని, వైద్య సదుపాయాలు మెరుగుపరుచుకోవడం చాలా కీలకమని, వైద్య వ్యవస్థ పటిష్టంగా ఉన్న రాష్ట్రాలు తక్కువ నష్టంతో బయటపడతాయని సీఎం కేసీఆర్ సూచించారు. తెలంగాణ ఆచరిస్తుంది-దేశం అనుచరిస్తున్నది ఆ దిశగా దేశ వైద్య రంగానికి మణిహారంగా తెలంగాణ రాష్ట్రంలో వైద్య విద్య అభివృద్ధి చేస్తున్నామని, వేల కోట్లు ఖర్చు చేసి విద్యార్థులకు సౌకర్యాలు కల్పిస్తున్నామని అన్నారు. విద్యార్థులు సామాజిక భద్రత, పేదలకు, తెలంగాణ ప్రాంత ప్రజలకు గొప్ప సేవలు అందించాలనే ఉద్దేశంతో మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. విద్యార్థులు విద్యనభ్యసించి విజయం సాధించాలని, కళాశాలలో వచ్చే చిన్న చిన్న ఇబ్బందులను వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని సీఎం కేసీఆర్ సూచించారు. నూతనంగా ప్రారంభించిన వైద్య కళాశాలలను వైద్యశాఖ మంత్రి ఉన్నత అధికారులు, జిల్లా స్థాయి అధికారులు నిరంతరం తనిఖీలు నిర్వహిస్తూ, విద్యార్థులకు ఎదురయ్యే చిన్న చిన్న సమస్యలను పరిష్కరించాలని ఆర్ అండ్ బి శాఖ మంత్రి వైద్య కళాశాలలకు సంబంధించిన భవన నిర్మాణ పనులు సత్వరం పూర్తి అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని సీఎం కేసీఆర్ వారిని ఆదేశించారు. అనంతరం జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ భాష మాట్లాడుతూ వనపర్తి జిల్లా విద్యారంగంలో చాలా ముందుకు వెళ్తుందని ఆమె అన్నారు. పండిత్ జవహర్‌లాల్ నెహ్రూ పాలిటెక్నిక్ కళాశాలను ప్రారంభించారని అప్పటి నుండి ఇప్పటి వరకు విద్య హబ్‌గా వనపర్తి జిల్లా మంచి గుర్తింపు ఉందని ఆమె తెలిపారు. నీట్ కౌన్సిలింగ్‌లో వనపర్తి జిల్లాకు 150 సీట్లు కేటాయించగా 87మంది వైద్య విద్యార్థులు అడ్మిషన్ లు పొందినట్లు ఆమె సూచించారు. 8మెడికల్ కాలేజీలు ఒకేసారి ప్రారంభించడం చాలా సంతోషకరమని, వనపర్తి జిల్లాలో మెడికల్ కళాశాలను మంజూరు చేసినందుకు సీఎం కేసీఆర్ కు, వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలో అన్ని రకాల స్పెషాలిస్టు డాక్టర్లు అందుబాటులో ఉన్నారని, మంచి అనుభవం కలిగిన అధ్యాపకులు విద్యార్థులకు అందుబాటులో ఉన్నారని సౌకర్యాలను సద్వినియోగం చేసుకుంటూ మంచి డాక్టర్లగా తయారు కావాలని ప్రజలకు ఉన్నతమైన వైద్య సేవలు అందించే దిశగా కృషి చేయాలని ఆమె విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ చైర్మెన్ లోక్‌నాథ్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం వైద్య విద్య రంగానికి అధిక ప్రాధాన్యతను ఇస్తుందని ఆయన అన్నారు. మెడికల్ కాలేజీ, ఇంజనీరింగ్ కళాశాల వనపర్తి జిల్లాకు రావడం సంతోషకరమని ఆయన తెలిపారు. జిల్లాలోని విద్యార్థులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోని ఉన్నత స్థాయికి ఎదగాలని, వైద్య సేవలు అందించాలని ఆయన సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాష వైద్య విద్యార్థులతో కలిసి మెడికల్ కళాశాలలో భుజించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ డి.వేణుగోపాలన, మున్సిపల్ చైర్మెన్ గట్టు యాదవ్, వైస్ చైర్మెన్ వాకిటి శ్రీధర్, ఎంపీపీ కిచ్చా రెడ్డి, రైతు బంధు సమితి అధ్యక్షుడు జగదీష్ రెడ్డి, కురుమూర్తి యాదవ్, ప్రిన్సిపల్ సునందిని, సూపరిండెంట్ నరేందర్ కుమార్, ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ హిమబిందు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.ప్రమోద్ కుమార్, జిల్లా ప్రధాన ఆసుపత్రి సూపరిండెంట్ డా.శ్రీధర్, జడ్పీటీసీలు, ఎంపీటీలు, ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు, మెడికల్ కళాశాల విద్యార్థులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మహాత్మ జ్యోతిరావు పూలే బాలుర గురుకుల హాస్టల్‌లో విద్యార్థికి తీవ్ర గాయాలు

### - సాంబర్‌లో పడ్డ ఐదోతరగతి విద్యార్థి

### - బయటికి పొక్కకుండా విద్యార్థులను కట్టడి చేసిన హాస్టల్ వార్డెన్, ప్రిన్సిపల్



కాలిన విద్యార్థి శరీరం

**నారాయణపేట ప్రతినిధి, నవంబర్ 15, ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా మక్తల్ మండల కేంద్రంలో ఉన్న మహాత్మ జ్యోతిరావు పూలె తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ బాలుర గురుకుల హాస్టల్ మక్తల్ లో 5వ తరగతి విద్యార్థి సాంబర్ లో పడిన విషయం ఆలస్యంగా తెలిసింది. ఈవిషయం బయటకు పోకుండా హాస్టల్ వార్డెన్, ప్రిన్సిపల్ హాస్టల్ విద్యార్థులను కట్టడి చేశారు. ఆ బాబుకు కొంత మేర చికిత్స చేసి తల్లిదండ్రులను పిలిపించి బాబును ఊరికి తీసుకెళ్లండి అని చెప్పి ఊరికి పంపించినట్లు విశ్వసనీయ సమాచారం. వివరాల్లోకి వెళితే గద్వాల జిల్లా ఎల్కూర్ గ్రామానికి చెందిన 5వ తరగతి విద్యార్థి (11). మధ్యాహ్నం సమయంలో భోజనం తీసుకోవడానికి లైన్‌లో నిలబడుతూ ఒకరికి ఒకరు తోసుకుంటూ అదుపుతప్పి సాంబర్ లో పడినట్లు తోటి విద్యార్థులు తెలిపారు. ఇక్కడ ఇంత జరిగిన కూడా హాస్టల్ సిబ్బంది నిర్లక్ష్యంగా తమకు ఏమీ తెలియనట్లు వ్యవహరిస్తున్నారు. ముఖ్యంగా ఈ నిర్లక్ష్యానికి కారణం హాస్టల్ వార్డెన్, ప్రిన్సిపల్ అందుబాటులో ఉండకుండా ఎవరికో ఒకరికి ఉపాధ్యాయులకు చెప్పి గురుకులం నడుపుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో 15రోజుల క్రితం కూడా ఒక విద్యార్థి కిందపడడం జరిగిందని ఆ బాబు తలకు గాయం కూడా కావడం జరిగిందని విద్యార్థులు తెలిపారు. విద్యార్థులకు అందుబాటులో లేని హాస్టల్ వార్డెన్, ప్రిన్సిపల్ పై చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

## కార్మికుల సంక్షేమ బోర్డుకు ప్రమాదం తెచ్చే 4లేబర్ కోడ్ లను రద్దు చేయాలి



నిరసనలో పాల్గొన్న భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు

**వనపర్తి టౌన్, నవంబర్ 15, ప్రభాతవార్త :** వనపర్తి జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా భవన ఇతర నిర్మాణ కార్మిక సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు డి.కురుమయ్య, జిల్లా అధ్యక్షుడు గంధం మదన్, వనపర్తి జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం గౌరవ అధ్యక్షుడు, సీఐటీయు జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా భవన ఇతర నిర్మాణ కార్మిక సంఘం పిలుపు మేరకు నిరసన కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. కార్మికులకు ఉన్న సంక్షేమ బోర్డుకు ప్రమాదం తెచ్చే నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని అన్నారు. వెల్ఫేర్ బోర్డులో రూ.2వేలకోట్లతో ఒక వెయ్యి5కోట్లు రాష్ట్ర ప్రభుత్వం డైరెక్టర్ చేసిందని, వాడుకున్నదని వాటిని వెంటనే ముఖ్యమంత్రి హామీ మేరకు భవన నిర్మాణ కార్మికులకు వెంటనే బైకులు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ వెల్ఫేర్ ప్రమాదం జరిగితే రూ.6లక్షలు ఇస్తుందని, అది రూ.10లక్షలకు పెంచాలని, సాధారణ మరణానికి రూ.1లక్ష ఇస్తున్నారని అది రూ.5లక్షలకు పెంచాలని, పెళ్లిలకు రూ.30వేలు ఇస్తున్నారని అది రూ.1లక్ష, కాన్పులకు రూ.30వేలు ఇస్తున్నారు, అది రూ.50వేలు, 60ఏళ్లు దాటిన భవన నిర్మాణ కార్మికులందరికి రూ.10వేలు నెలకు పెన్షన్ ఇవ్వాలని వారి పిల్లలకు స్కాలర్‌షిప్ విద్యా, వైద్యం అందించాలని, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లఓ అధిక ప్రధాన్యం ఇవ్వాలని ప్రభుత్వ పనుల్లో స్థానిక భవన నిర్మాణ కార్మికులకు పని కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు జిల్లా సహాయ కార్యదర్శి గోపాలకృష్ణ, జిల్లా కమిటీ సభ్యులు నందిమల్ల రాములు, వనపర్తి భవన నిర్మాన కార్మిక సంఘం పట్టణ అధ్యక్షుడు జి.బాలస్వామి, పట్టణ ప్రధాన కార్యదర్శి రాబర్ట్, నాయకులు బి.కురుమయ్య, మన్యం, గట్టయ్య, సీఐటీయు నాయకులు ఎం.రాములు, కురుమయ్య, రత్తయ్య,భాస్కర్ పాల్గొన్నారు.

## విద్యార్థులకు డిక్షనరీలు పంపిణీ



**మల్దకల్, నవంబర్ 15, ప్రభాతవార్త :** ప్రపంచ బాలల దినోత్సవం సందర్భంగా జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం విఠాలాపురం గ్రామంలో సోమవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాథమిక పాఠశాలలో జిల్లా ఫోటో వీడియో గ్రాఫర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్ఎస్ శేఖర్ ఆధ్వర్యంలో జరిగింది. పాఠశాలలోని 6వ తరగతి,10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఇంగ్లీష్, తెలుగు డిక్షనరీలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజేంద్ర కుమార్, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్ రెడ్డి, వెంకటస్వామి, శంకర్ నాయక్, రిషిరాజ్, లొక్యనాయక్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యారెడ్డి, ఉపాధ్యాయులు నరసింహులు, నాగమణి, వీడియోగ్రాఫర్ వెంకటేష్, అడ్వకేట్ రమేష్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా డా.బాలకృష్ణయ్య వర్ధంతి

**వనపర్తి టౌన్, నవంబర్ 15, ప్రభాతవార్త :** బడుగు బలహీన వర్గాల ఎమ్మెల్యే డా.బాలకృష్ణయ్య వర్ధంతి సందర్భంగా ఏరియా ఆసుపత్రిలో డా.చైతన్య ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షుడు సతీష్ యాదవ్ మాట్లాడుతూ అతి కొద్ది మంది డాక్టర్లలో డా.బాలకృష్ణయ్య ప్రథముడని, ఆయన చేసిన సేవలు మరువలేనివని అన్నారు. గ్రామపంచాయితీ సర్పంచ్‌గా రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిపించారని ఆయన కొనియాడారు.

**వనపర్తి టౌన్ :** వనపర్తి జిల్లా కేంద్రంలో కమాన్ చౌరస్తా, ఏరియా ఆసుపత్రిలో వనపర్తి జిల్లా పరిషత్ చైర్మెన్ ఆర్.లోక్‌నాథ్ రెడ్డి డా.బాలకిష్టయ్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో బోలెమోని రాములు, జిల్లా వైద్య సిబ్బంది, సర్దార్‌ఖాన్, రమాకాంత్, జనజోల, అడ్వకేట్ శ్రీను, సోస్టల్ శ్రీనివాస్, మదన్ సింగ్, మాన్‌తప్ప, అమర్‌నాథ్, టెలిఫోన్ బలరాం, ముదిరాజ్ మన్యం, గంధం నాగరాజు, తిరుపతయ్య యాదవ్, రమేష్, అప్పుర్ పాల్గొన్నారు.



